'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

# కాటు

-ఆనందరావు పట్నాయక్

జీపు ఘాట్‌రోడ్డు మీదుగా పోతుంది. కొండ అంచున రోడ్డువేసి రక్షణ గోడ కట్టారు. శిరీష్ దృష్టి లోయ మీద పడింది. ఒక్కసారి ఒళ్ళు ఝల్లుమంది. పొరబాటున జీపు ఆ లోయలోకి పడిపోతే అంతే సంగతులు. నల్లటి పొగ విడిచిపెడుతూ పెద్ద శబ్దం చేసుకొంటూ జీపుపైకి పైపైకి పోతుంది.

'వెల్‌కం టు ప్రాజెక్టు బోండా' అన్న బోర్డు కనపడింది. సుమారు కొండ శిఖరంమీద చదునుగా ఉన్న ప్రదేశం అది. జీపు ఒక ఇంటిముందు ఆగింది.


'అంతుశ్, ఐ.ఏ.ఎస్.'

ప్రాజెక్టు డైరెక్టరు అన్న బోర్డుంది. శిరీష్ దిగి లోనికి నడిచాడు. అంతుశ్‌తో కలిసి తన విజిటింగు కార్డు ఇచ్చాడు. 'వెల్‌కం టు బోండా హిల్స్' అన్నాడు అంతుశ్ ఉత్సాహంతో. 'థ్యాంక్యూ సార్!' అన్నాడు శిరీష్ వినమ్రత నిండిన గొంతుతో.

శిరీష్ అంత్రపాలజీలో రిసెర్చ్‌చేస్తున్న విద్యార్థి. తనకు కావలసిన సబ్జెక్టుకోసం అంతుశ్‌ని కలవమని రిసెర్చ్‌గైడ్ సజెస్ట్ చేశాడు. ఉత్తర ప్రత్యుత్తరాలనంతరం తనని రమ్మనమంటూ అంతుశ్ అంగీకారం తెలిపాడు. అనుమతి పొందిన మరుసటిరోజే బయల్దేరి వచ్చాడు శిరీష్. ఆ మరుసటిరోజు ఇద్దరూ మార్నింగ్ వాక్‌కు బయల్దేరారు.

వేసవి కాలం. అయినా గోరువెచ్చని సూరీడు వెర్రెత్తించినట్లు లేడు. సముద్ర మట్టానికి కొన్ని వేల అడుగుల ఎత్తున ఉన్న బోండా హిల్స్ మీద వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఆంధ్రాకు సరిహద్దునున్న ఒరిస్సాలో బాగా వెనుకవడిన మల్కన్‌గిరి జిల్లాలో బోండా అన్న ఆదిమ తెగ అది. వీరంతా నిరక్షర కుక్షులు. నాగరికతకు బహుదూరంలో ఉన్నారు. ఉప్పు, కిరసనాయిలు కోసం మాత్రమే వీళ్లు సంతలకు వస్తారు. అరటి గెలలు, పుట్టతేనె, పసుపు కొమ్ములు, సాంబ్రాణి, పొంగుండ లాంటివి వర్తకులకిచ్చి వాళ్లిచ్చిన కొద్దిపాటి సామగ్రి పుచ్చుకొని వెళ్లిపోతారు బోండా గిరిజనులు. విల్లు, బాణాలు వారి అలంకరణలో ఒక ప్రత్యేకంగా ఉంటాయి. ఎవరైనా తమను చూసి నవ్వారంటె బాణాలు అవతలి వారి గుండెల్లో దిగాయన్నమాటె. చెప్పడం ఆపి ఆగాడు అంతుశ్. ఎదురుగా చిన్న గెడ్డ ప్రవహిస్తుంది. ఒక బోండా స్త్రీ పసిపాపను ఎత్తుకొని పోతుంది. అంతుశ్ ఆమెనడిగాడు. వాళ్లిద్దరు మాట్లాడుకొన్న భాష శిరీష్‌కి ఏమీబోధపడలేదు. ఆమె తనదారిన తాను వెళ్లిపోయింది. వాళ్ల మాటలకు అర్థం ఏమిటని అడిగాడు శిరీష్.

నిండు చూలాలైన ఆమె కర్రలకోసం అడవిలోకివెళ్తె ఎలుగుబంటి ఎదురయింది. ఇద్దరకు జరిగిన హోరాహోరి యుద్ధంలో ఎలుగుబంటి ఆమె ధాటికి తాళలేక పారిపోయింది. ఇంతలో ఆమెకు నొప్పులు రావడం, పండంటి బిడ్డడ్ని కనడం, పారుతున్న సెలయేరులో తల్లీ, బిడ్డ స్నానం చేసి ఇంటికి వెళ్లడం... ఏకధాటిగా చెప్పుకుపోతున్న అంతుశ్ ఆగి చూసాడు. శిరీష్ ఆశ్చర్యంతో నోరు తెరుచుకొని ఆగిపోయాడు. అంతుశ్ వెనక్కువెళ్లి అతన్ని తట్టి ఈ లోకంలోకి తెచ్చాడు. అంతుశ్‌ను అనుసరించాడు శిరీష్.



చిన్నపల్లె. సినీమా స్టూడియోలో వేసిన సెట్టింగులా ముద్దుగా ఉన్నాయి గుడిసెలు. వాటిలోకి వెళ్లాలంటె బాగా తల వంచి వెళ్లాలి. ఆవు పేడతో అలికి ముగ్గులు పెట్టారు. ఎంత పెద్ద తుఫాను వచ్చినా చెక్కు చెదరని రీతిలో కట్టారు ఆ గుడిసెలు. పైన తాటాకులు, గడ్డి వేసినేసారు. కుంభవృష్టి కురిసినా ఒక్క చుక్క నీరు లోనికి రాదు. బోండాలు పరిశుభ్రత పాటించకపోయినా గుడిసెల లోపల అంత ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనడం శిరీష్‌ని ఆశ్చర్యపరిచింది. జొన్న సంకటి, నిప్పుల మీద కాల్చిన జంతు మాంసం, సొలొపా కల్లు వాళ్లకు అత్యంత ఇష్టమైన భోజనం. వాళ్ల వేషధారణ విచిత్రంగా ఉంటుంది. ఆడా, మగా కాపీనం ధరిస్తారు. స్త్రీలు మాత్రం పూసల పేర్లు దిగేసుకొని వక్షోజాలు కప్పుకోడానికి చూస్తారు. మబ్బుల మాటున దాగిన పూర్ణేందు చంద్రబింబాలు గుర్తుకు వస్తాయి. పచ్చబొట్లంటె మహా ప్రీతి వాళ్లకు. రాత్రి పడుకొనేటప్పుడు పూసల దండలు తీసి మేకుకు తగిల్చి చిన్నపాటి తువ్వాళ్లు కప్పుకొని నిద్రపోతారు ఆడవాళ్లు. నిర్జన తీరాల్లో ఇసుక మేటలు రాశులు రాశులుగా పోగయి రంజింప చెయ్యడం ఒక్క క్షణం గుర్తుకు వస్తుంది ఆ సమయాన. వాళ్లకు వాళ్ల భాష తప్ప మరోటి రాదు. ఆ భాషకు లిపి లేదు. శిరీష్‌కి బోండాలమీద రిసెర్చి చెయ్యడానికి మరింత ఇంటరెస్టు పెరిగింది. భాష ఒక ప్రతిబంధకం కాకూడదు. అంతుశ్ లాంటి వాళ్లు తనకు అండగా ఉంటె చాలు. తనొక సిద్ధాంత గ్రంథం సునాయాసంగా రాయొచ్చు.

కొండల నుండి ఊరి పడుతున్న సన్నని జల పాతం, ఒక గోతిలో పడుతుంది. చుట్టూ లతలు అల్లుకొని ఉన్నాయి. పక్షుల కుహుకుహుల రావాలతో, అడవి పూల వాసనతో ఆ ప్రాంతం ఎంతో హాయిగా ఉంది. ఒక కవి మాటల్లో అర్ధరాత్రి చీకట్లో జోరున వాన కురుస్తున్నట్లు, పసిపాప ఆపకుండా కిలకిల నవ్వినట్లు, కథ చెప్తున్నప్పుడు ప్రియురాలు కళ్లు పెద్దవి చేసి వీణ మీటులా 'ఊ'కొడ్తూ శ్రద్ధగా వింటున్నట్లు, ఇంటాబయటా, నేలన, నింగిన అంతా సంగీతమయమయినట్లు అనిపిస్తుంది.

వాళ్లిద్దరు ఇంటికి చేరుకొనేసరికి సందడిగా ఉంది. జనం గుమిగూడి ఉన్నారు. నేలమీద శవం ఉంది. కుల పెద్ద కూర్మన్న కొడుకుది. ఎవ్వరూ ఏడ్వడం లేదు. శిరీష్‌కి వింతనిపించింది. అంతుశ్, బోండాలు మాట్లాడుకొన్నారు. ఏదో విషప్పురుగు కుట్టి చనిపోయాడని అన్నారు. వాడి కుడి కాలి మడమమీద రెండు గాట్లు కూడా ఉన్నాయి. శరీరం నల్లగా కుమిలి ఉంది. శవం లేచింది. అంతా వెళ్లిపోయాక స్మశాన శాంతి నెలకొందక్కడ. అంతుశ్ గంభీర వదనం చూసి మరేమీ అడగలేకపోయాడు శిరీష్. మధ్యాహ్నం భోజన సమయంలో డ్రైవరు రంగ చెప్పాడు. కూర్మన్న కొడుకు తాగుబోతు.

పరమ మూర్ఖుడు. తన వాటాగా వచ్చిన సాలొపా చెట్ల నుండి వచ్చిన కల్లుని తండ్రి తాగేసాడని గొడ్డలితో తల నరికేయబోయిన ప్రబుద్ధుడు. కాని పురుగు కుట్టి వాడు చావలేదు. ఏ బోండా కన్య పైనో అత్యాచారాం చెయ్య బోయి చావుకోరి తెచ్చుకున్నాడు. విషపూరితమైన బాణంతో అలా గాట్లు పెట్టడం మూలాన కూర్మన్న కొడుకు చచ్చాడు. బోండా స్త్రీలు ఏదైనా సహిస్తారు కాని మాన ధనం దోచేయ్యాలని ప్రయత్నించె కామాంధు ఒను విడిచిపెట్టరు.

శిరీష్‌కి లెక్చరరుగా ఉద్యోగం దొరికింది. ఒకరోజు మీటింగులో అంతుశ్‌ని కలిసాడు. బోండా ప్రాజెక్టు నుండి బదిలి అయివచ్చేసాడు. మీటింగ్‌నుండి తనని విడిచిపెట్టేందుకు వచ్చిన డ్రైవరు రంగ చెప్పిన విషయాలు ఆశ్చర్యపరిచాయి. బోండాలకు విద్యాబుద్ధులు చెప్పి, తాగుడికి బానిసలు కాకుండా వాళ్లని తీర్చిదిద్దడంలో కృతకృత్యుడయిన అంతుశ్ కీర్తిప్రతిష్టలు రాష్ట్ర రాజధానిదాకా పాకాయి. కాని నియోజకవర్గపు ఎమ్.ఎల్.ఏ.కి కంటగింపయింది. బోండాలు చదువుకొని పైకొస్తె వాళ్ల వోటు బ్యాంకు పోతుంది. అది తన పదవికి చేటు. ఎక్కడి వాళ్లు అక్కడనె ఉండాలి అన్నది అతని సిద్ధాంతం. దాని ఫలితం అంతుశ్ ట్రాన్స్‌ఫరు. జీవితం అనే యీ చదరంగంలో నిచ్చెనలు, పాములు మామూల్గలె అనుకొన్నాడు శిరీష్.

* * *

శిరీష్ రెసెర్చి పూర్తయ్యాక యూనివర్సిటీ దానిని పరిశీలించి ఇంటర్వ్యూకి రమ్మనమని పిలుపునిచ్చింది. ఇంటర్వ్యూ బోర్డులో వాళ్లు అడిగిన ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలిచ్చాడు. డాక్టరేట్ రావడం ఖాయం. సంతోషంతో గెస్టుహౌస్‌కి వచ్చి రెస్టు తీసుకొంటున్నాడు. టి.వి. ఆన్ చేసాడు. ఆరోజు రాఖీ పౌర్ణమి. రాఖీ విశిష్టతను చాటుతూ ఎనౌన్సరు ఏదో చెప్తోంది. బోరుకొట్టి టి.వి. ఆఫ్ చెయ్యబోయాడు. ఇంతలో ప్రత్యక్ష ప్రసారం చూడగలరు. చీఫ్ మినిష్టరు నివాసంలో జరిగిన రాఖీ బంధన్ తిలకించగలరన్న ప్రకటన వెలువడింది. చిన్న పిల్లలు, మూగ బధిర విద్యార్థులు, ఇలా పలు రంగాల నుండి వచ్చిన బాలికలు, మహిళలు, సంఘసేవికలు ముఖ్యమంత్రికి తిలక మద్ది పూల గుత్తులిచ్చి రాఖీలు కడుతున్నారు.

'బోండా హిల్స్ నుండి వచ్చిన బోండా యువతలు యిప్పుడు ముఖ్యమంత్రికి రాఖీలు కడతారు' అన్న అనౌన్సుమెంటు విన్పించింది. శిరీష్ ఉత్సుకతతో చూడడం మొదలెట్టాడు. పరువంలో ఉన్న బోండా స్త్రీలు సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చారు. సన్నగా విన్పిస్తున్న డ్రమ్సు బీట్‌కి రిథమిక్‌గా అడుగులు వేస్తూ ఒకరి భుజాలమీద ఒకరు చేతులు వేసుకొని వలయాకారంగా తిరుగుతూ నాట్యం చేస్తున్నారు. వాళ్లందరి జబ్బలకి తాయెత్తులుకట్టి ఉన్నాయి. వాటిలో అమర్చిన బాణం ములుకులు శిరీష్ దృష్టిని ఆకర్షించాయి. కెమెరా పదే పదే ఒక వ్యక్తిని ఫోకస్ చేస్తుంది. మంత్రి కుంతీపుత్రగారు బోండాల చేత ముఖ్యమంత్రిగారికి సన్మానం చేయిస్తారు. తర్వాత రాఖీలు కడతారు. టి.వి. ఏంకరు మంత్రి భజన చెయ్యడంలో మునిగిపోయాడు. కార్యక్రమం ముగిసింది. శిరీష్ టి.వి. కట్టేసి నిద్రకుపక్రమించాడు. మంత్రిగారి పేరు విన్నట్టుంది. బాంగ్లాదేశ్ నుండి కాందిశీకుడయి వచ్చి అంచెలంచెలుగా పెరిగి రాజకీయ చదరంగంలో మహోన్నత శిఖరాలు ఎక్కి వచ్చిన మహనీయుడు, కుంతీపుత్ర. బోండా నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉంటూ అంతుశ్‌ను బదిలీ చేయించింది ఆయనే. దానికితోడు యీమధ్య స్కాంలో కూరుకుపోయిన అవినీతిపరుడు. సి.ఎమ్. ఉద్వాసన చెప్పక ముందె యిటువంటి జిమ్మి చేసి పదవికి గండం తప్పుతుందని అంతదూరం బోండాలను పిలిపించినట్లుంది.



కాకపోతే పాముకాటుకి మంత్రి మరణించడం ఏమిటో? ఎవరో నక్సలైటు గాని, అపోజిషన్‌వాళ్లు గాని వేటువేసి ఉంటారు' అని డ్రైవరు రోడ్డుమీద దృష్టిసారించి రివ్వున పోతున్నాడు.
'మంత్రిగారి పేరేమిటన్నట్లు' అడిగాడు శిరీష్.
'కుంతీపుత్ర అట'అన్నాడు డ్రైవరు.

* * *

భళ్లున తెల్లారింది. శిరీష్ తన సూటికేసు పట్టుకొని బయల్దేరాడు. ఆటో బస్టాండుకి దారితీసింది. ఒక పెద్ద భవంతి ముందు జనం... జనం... ఆటోడ్రైవరుకి అదేమిటో తెలుసుకుంటామన్న ఉత్సుకత పెరిగింది. విన్న తర్వాత ఒహో అని చప్పరించి ఆటోస్టార్టుచేసి ముందుకు కదిలించాడు. శిరీష్ ఏమిటయిందని అడిగాడు. మంత్రిగారు మరణించారట అన్నాడు. అలాగా అని తల పంకించాడు శిరీష్.

'అవును సార్! యీ మహానగరంలో పాములున్నాయంటారా?' అడిగాడు డ్రైవరు.

'ఏం?'అన్నాడు శిరీష్.

'కాకపోతే పాముకాటుకి మంత్రి మరణించడం ఏమిటో? ఎవరో నక్సలైటు గాని, అపోజిషన్‌వాళ్లు గాని వేటువేసి ఉంటారు' అని డ్రైవరు రోడ్డుమీద దృష్టిసారించి రివ్వున పోతున్నాడు.

'మంత్రిగారి పేరేమిటన్నట్లు' అడిగాడు శిరీష్.

'కుంతీపుత్ర అట'అన్నాడు డ్రైవరు.

'ఆపు' అన్న కేకతో డ్రైవరుతోపాటు రోడ్డున పోతున్న పాదచారులు కూడ ఉలిక్కిపడ్డారు. 'మంత్రిగారి బంగళాకు తీసుకువెళ్లు'అన్నాడు శిరీష్.

మంత్రిగారి భౌతిక కాయం పూల మాలలతో నిండిపోయింది. మొహం మాత్రమే కన్పడుతోంది. తెల్లటి పంచె, జుబ్బాలో మంచి పుష్టిగా ఉన్నాడు కుంతీపుత్ర. మరొక అర్ధ శతాబ్దం హాయిగా బతకాల్సిన వాడు కాలం తీరిపోయింది. నిట్టూర్చుతూ వెనుక తిరగబోయాడు శిరీష్. అతని దృష్టి మంత్రిగారి పాదాలమీద పడింది. పంచె కాస్త ఎగరడంతో కాలి మడమ దానిమీద రెండు గాట్లు కనపడ్డాయి. ఈసారి నిశితంగా చూసాడు. ఒళ్లంతా నల్లగా కమిలిపోయి ఉంది.

మౌనంగా వచ్చి ఆటోలో కూర్చుని పోనివ్వమన్నాడు. మంత్రి మరణానికి సానుభూతి బదులు శిరీష్ మనసులో ఆనందం చోటుచేసుకొంది. అది అతని పెదవులపై చిరునవ్వుగా ప్రతిఫలించింది.

★

# మరో మోనాలిసా శాలభంజికా!



అతిసుందర వదనం. విశాల నేత్రాలు. ముచ్చటగొలిపే నాసిక. పూలరేకులవంటి పెదాలు. విప్పారిన పుష్పం నలుదిశలా చిర్నవ్వులు గుమ్మరిస్తున్నట్టుగా -అందానికి నమూనా ఆ శిల్పం. ఓ అజ్ఞాత శిల్పి కళా నైపుణ్యం. సృజనాత్మకతను రంగరించి రాతికి ఉలితో ఊపిరిలూదిన రమణీయ కళాఖండం అది. ఎన్నిసార్లు చూసినా మధురానుభూతులు పంచే అపురూప శిల్పం పేరే 'శాలభంజిక'. లేక వృక్షమాత. రెండడుగుల ఈ శిల్పం 11వ శతాబ్దంలో మధ్యప్రదేశ్‌లోని విదిశ జిల్లా గైరేస్‌పూర్ గ్రామంలో తవ్వకాలు జరిపినపుడు లభించింది. చేతులు శిధిలమై, పై అర్ధభాగం పగిలినా -ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు లియొనార్డో డావిన్సీ చిత్రించిన తైలవర్ణం మోనాలిసా అందాలతో సరితూగగల శిల్పం శాలభంజిక. ప్రస్తుతం శాలభంజికను గ్వాలియర్ మ్యూజియంలో దర్శించవచ్చు. మ్యూజియం క్యూరేటర్ లాల్‌బహదూర్‌సింగ్ ఇలా అంటాడు -'నేను తొలిసారి శిల్పాన్ని చూసినపుడు ప్రేమలో పడ్డాను!' -1980లో విదిష నగరానికి కలెక్టర్‌గా పనిచేసిన దేవరాజ్ బిద్దీ 'శాలభంజిక' గురించి అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశాడు. ఆ రాతలతోనే సుందరమైన కళాఖండం గురించి అందరికీ తెలిసింది. 1987లో ప్యారిస్‌లో నిర్వహించిన భారత కళాఖండాల ఉత్సవంలో దీన్నీ ప్రదర్శించారు. ఈ కళాఖండాన్ని ప్యారిస్ వేనోళ్ల పొగిడింది. విమర్శకులు సైతం బ్రహ్మరథం పట్టారు. ఆ తరువాత రెండుకోట్ల రూపాయలకు ఇన్సూర్ చేసిన శిల్పాన్ని, గాజుపెట్టెలో పెట్టి భద్రపరిచారు. మాజీ మధ్యప్రదేశ్ గవర్నర్ కున్వంత్ మహమూద్ ఆలీఖాన్ చీకటిలో గొప్ప కళాఖండం బంధించి ఉండటాన్ని చూసి ఖండించారు. -అప్పట్నుంచీ అంటే 1993నుంచీ దర్శనార్థం శాలభంజిక ప్రజల ముందుకు వచ్చింది. ప్యారిస్ ప్రదర్శనతో శాలభంజిక పేరు ప్రఖ్యాతులు దిశదిశలా వెల్లడవ్వడంతో -దీనికి పటిష్ట భద్రత అవసరమైంది. 'కొన్నేళ్లుగా శాలభంజికను చూస్తున్నాను. అయినా -ఆ భామ మనసులో ఏముంది? ఆ చిర్నవ్వుకు అర్థం ఏమిటి అన్నది నాకు అర్థం కాలేదు. ఆ చిర్నవ్వు మోనాలిసా నవ్వుకు మించింది' అంటాడు మ్యూజియం క్యూరేటర్ లాల్ బహదూర్ సింగ్. శిల్పాన్ని చూస్తే నిజమే అన్పిస్తోంది కదూ!

**-శ్రీరామమూర్తి**